## అధ్యాయము 25

# గుడారము కొరకు సూచనలు

## (భాగము 1)

నిర్గమకాండము 25వ అధ్యాయము మొదలు, ప్రత్యక్షగుడారమును నిర్మించుటను గూర్చి ఇవ్వబడిన వివరాలే తదుపరి అధ్యాయాలలో ఎక్కువగా కనబడతాయి. ఇశ్రాయేలు ప్రజలు అరణ్యములో గడిపిన సంవత్సరములలో మరియు ఆ తరువాతి కొన్ని శతాబ్దాల వరకు కూడా దేవుడు తన ప్రజలతో కలిసికొనుటకు ఈ ప్రత్యక్ష గుడారము అనునది ఒక సంచార ఆలయం. సీనాయి పర్వతముమీద మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు ఇచ్చిన ధర్మశాస్త్రములోనే ఈ ప్రత్యక్షగుడారము యొక్క నిర్మాణము మరియు దానిలో చేయవలసిన సేవలను గూర్చిన నిర్దేశాలు అందులో భాగమైయున్నాయి. యాజకుల యొక్క పని ఈ ప్రత్యక్షగుడారముతో ముడిపేయబడి ఉంది గనుక, ఈ అధ్యాయములలోనే యాజకత్వమును గూర్చిన ఆదేశాలు కూడా ఇవ్వబడ్డాయి.

నిర్గమకాండము 25-31 అధ్యాయములు ప్రత్యక్షగుడారమును నిర్మించుటకుగల ఆదేశాలను చెప్తున్నాయి, ఇట్లుండగా నిర్గమకాండము 35-39 అధ్యాయములు, దరిదాపుగా ఇదే భాషలో, ఆ ఆదేశములను ఎలా నిర్వహించాలో చెప్తున్నాయి. ఈ కథనమునకు మధ్యలో (అధ్యాయములు 32-34), బంగారపు దూడ ప్రతిమను చేసికొని ఇశ్రాయేలు ప్రజలు ఎలా త్రోవతప్పిపోయారో, దాని ఫలితంగా వచ్చిన శిక్ష, మరియు తన ప్రజలతో దేవుడు కృపతో చేసిన నిబంధన పునరుద్ధరణ తెలియజేస్తున్నాయి. ప్రత్యక్షగుడారము సంపూర్తి చేయబడడం మరియు తన ప్రసన్నతతో దేవుడు దానిని ఆశీర్వదించడం అనే విషయాలతో ఈ పుస్తకము ముగుస్తుంది (అధ్యాయము 40).

నిర్మాణము కొరకు అనేకమైన వస్తువులను ఎలా సమకూర్చుకోవాలో అని దేవుడు మోషేకు ఇచ్చిన నిర్దేశములతో 25వ అధ్యాయము ప్రారంభమౌతుంది. ఇశ్రాయేలీయులు మనఃపూర్వక అర్పణలు అర్పించాలని దేవుడు చెప్పాడు (25:1-7). దేవుడు అనుకున్న విధముగా ఆ ప్రత్యక్షగుడారమును నిర్మించవలెనని ఆయన ఇచ్చిన ఒక ఆజ్ఞ తరువాత (25:8, 9), ఆ ప్రత్యక్షగుడారములోని మూడు విధములైన ఉపకరణములను ఎలా రూపించాలో అని తన నిర్దేశములను ఇవ్వడం మొదలుపెట్టాడు: నిబంధన మందసము (25:10-16), కరుణాపీఠముతోను మరియు కెరూబులతో (25:17-22); మరియు సన్నిధి రొట్టెల బల్ల (25:23-30); మరియు దీప స్తంభము (25:31-39). ధూపము

వేయుటకు ఒక వేదిక, పరిశుద్ధ స్థలములో మరొక ఉపకరణము మున్నగువాటిని నిర్మించవలసిన విధానములను గూర్చి 30:1-10 వచనముల వరకు నిర్దేశములు ఇవ్వబడలేదు. కొండమీద దేవుడు మోషేకు కనుబరచిన వాటి "రూపము చొప్పున" చేయుటకు జాగ్రత్తపడుము అనే మరొక హెచ్చరికతో ఈ అధ్యాయము ముగుస్తుంది (25:40).

| ప్రత్యక్షగుడారమును నిర్మించుట | |
|---|---|
| **నిర్గమకాండము 25-31**<br>**చేయవలసిన విధానం** | **నిర్గమకాండము 35-40**<br>**చేసిన విధానం** |
| ప్రత్యక్షగుడారములోని అర్పణలు **(25:1-9)** | ఆజ్ఞాపించబడి ప్రత్యక్షగుడారము కొరకు తేబడిన అర్పణలు **(35:4-9, 20-29; 36:2-7)** |
| నిబంధన మందసము **(25:10-22)** | మందసము **(37:1-7)** |
| సముఖపురొట్టె బల్ల **(25:23-30)** | బల్ల **(37:8-16)** |
| బంగారపు దీపవృక్షము **(25:31-39)** | దీపవృక్షము **(37:17-24)** |
| తెరలు, కొలుకులు, గుండీలు, పలకలు, అడ్డ తెర, గుడారపు తెర **(26:1-37)** | తెరలు మరియు పలకలు **(36:8-38)** |
| దహనబలులను అర్పించుటకు ఇత్తడి బలిపీఠము **(27:1-8)** | దహనబలులను అర్పించుటకు బలిపీఠము **(38:1-7)** |
| ప్రత్యక్షగుడారము యొక్క ఆవరణ **(27:9-19)** | ప్రత్యక్షగుడారము యొక్క ఆవరణ **(38:9-20)** |
| దీపము కొరకైన నూనె **(27:20, 21)** | దీపము కొరకైన నూనె **(39:37)** |
| యాజకపు వస్త్రములు **(28:1-43)** | యాజకపు వస్త్రములు **(39:1-31)** |
| యాజకులను మరియు అర్పణలను ప్రతిష్ఠించడం **(29:1-43)** | |
| ధూపము వేయు వేదిక **(30:1-10)** | ధూపము వేయు వేదిక **(37:25-28)** |
| ప్రత్యక్షగుడారము కొరకు ప్రాయశ్చిత్తార్థమైన క్రయధనము **(30:11-16)** | ప్రత్యక్షగుడారము యొక్క వెల **(38:24-31)** |
| ఇత్తడి గంగాళము **(30:17-21)** | ఇత్తడి గంగాళము **(38:8)** |
| అభిషేక సంభారము మరియు ధూపము **(30:22-38)** | సంభారము మరియు ధూపము **(37:29)** |
| పనివారలను ఎన్నుకోవడం **(31:1-11)** | పనిచేసేవారు పిలువబడి పేరుపెట్టబడుట **(35:10-19, 30-35; 36:1, 2; 38:21-23)** |
| విశ్రాంతి దినమును ఆచరించుట **(31:12-17)** | |
| | ప్రత్యక్షగుడారమును ముగించి నిలువబెట్టుట; యెహోవా ప్రత్యక్ష గుడారములోనికి ప్రవేశించుట **(39:32-43; 40:1-37)** |

## నిర్మాణము కొరకు ఇవ్వబడిన ఆదేశము మరియు ఇవ్వవలసిన అర్పణలు (25:1-9)

**[1]యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను [2]- నాకు ప్రతిష్ఠార్పణ తీసికొని రండని ఇశ్రాయేలీయులతో చెప్పుము. మనఃపూర్వకముగా అర్పించు ప్రతి మనుష్యుని యొద్ద దాని తీసికొనవలెను. [3]మీరు వారియొద్ద తీసికొనవలసిన అర్పణలేవనగా బంగారు, వెండి, ఇత్తడి, [4]నీలధూమ్ర రక్తవర్ణములు, సన్నపునార, మేకవెండ్రుకలు, [5]ఎరుపురంగు వేసిన పొట్టేళ్లతోళ్లు, సముద్రవత్సల తోళ్లు, తుమ్మకఱ్ఱలు, [6]ప్రదీపమునకు తైలము, అభిషేక తైలమునకును పరిమళ ద్రవ్యముల ధూపమునకు సుగంధ సంభారములు, [7]లేతపచ్చలు, ఏఫోదుకును పతకమునకును చెక్కు రత్నములు అనునవే. [8]నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధస్థలమును నిర్మింపవలెను. [9]నేను నీకు కనుపరచువిధముగా మందిరముయొక్క ఆ రూపమును దాని ఉపకరణములన్నిటి రూపమును నిర్మింపవలెను.**

ప్రత్యక్ష గుడారమును నిర్మించుటకుగాను ఇవ్వబడుతున్న నిర్దేశములు ప్రజల యొద్ద నుండి కొన్ని అర్పణలను సేకరించమని చెప్పుటతో మొదలవుతుంది (35:4-9తో పోల్చి చూడండి). ఈ ధనవస్తు అర్పణలు/సహాయసహకారములను గూర్చి గమనించవలసిన విషయాలు మూడు ఉన్నాయి: (1) అది మనఃపూర్వకముగా ఇవ్వవలసిన అర్పణ (2) విలువైన వస్తువులను ఇవ్వాలి (3) ఇవి ప్రయోగాత్మక ఉపయోగములకొరకు వినియోగింపబడాలి.

**వచనములు 1, 2.** ప్రజలందరూ మనఃపూర్వకమైన అర్పణలను ఇవ్వాలి, **మనఃపూర్వకముగా అర్పించు ప్రతిమనుష్యుని యొద్ద దాని తీసికొనవలెను.** సుస్పష్టముగా, ఈ అర్పణ అనేది దశమ భాగమో, ఒక పన్నో, లేదా ఇశ్రాయేలు ప్రజల నాయకులచే ఆజ్ఞాపించబడిన ఒక రుసుమో కాదు. కేవలం ప్రజల యొక్క ప్రేమ, కృతజ్ఞత, మరియు దేవుని పట్ల తమకున్న గౌరవములు వారిని ఇవ్వడానికి పురికోల్పాలి. ఈ అర్పణలు కేవలం "మనఃపూర్వకముగాను మరియు ఆనందముతోను ఇవ్వబడవలసియున్నవి" అని John I. Durham అన్నాడు.[1]

**వచనములు 3-7.** ఈ కథనములోని మిగిలిన భాగములో వారు ఇష్టపూర్వకముగానే ఇచ్చారని తెలుపుతుంది (35:20-29; 36:2-7 చూడండి). ఈ అర్పణ అనేది ఒక్కసారే ఇవ్వబడే అర్పణ. తరచుగా ఇవ్వవలసిన అర్పణలను గూర్చి, అంటే దశమభాగముల వంటివి (లేవీయ. 27:30-32; సంఖ్యా. 18:21-29; ద్వితీ. 12:6, 11; 14:22-28; ఇంకా చూడండి 2 దిన. 31:5, 6, 12; నెహెమ్యా 10:37, 38; 13:12; ఆమోసు 4:4; మలకీ 3:8-10 చూడండి) కూడా ధర్మశాస్త్రము చెప్తుంది. దీనికి తోడు, ప్రజలు లెక్కింపబడినప్పుడు ఇవ్వవలసిన అర్పణలను గూర్చి 30:11-16 చదువుతాము.

ఇశ్రాయేలీయులు ఇచ్చే ప్రతి ఒక్క అర్పణ కూడా విలువైనదే. వారు ఇచ్చిన కొన్ని మనఃపూర్వక అర్పణల యొక్క విలువను గూర్చిన సూచన 38:24-31లో చూడగలం.

ఇవ్వడానికి అంత విలువైన వస్తువులు వారికి ఎక్కడివి? నిస్సందేహంగా, ప్రత్యక్షగుడారమును నిర్మించడానికి ఇశ్రాయేలు ప్రజలు ఇచ్చిన అర్పణలలో ఎక్కువ శాతము వారు ఐగుప్తు దేశమును వదిలి వస్తున్నప్పుడు తమ పొరుగువారి యొద్ద నుండి అడిగి తెచ్చుకున్న వస్తువులలో నుండి ఇచ్చినవే (3:21, 22; 11:2; 12:33-36). John J. Davis వ్రాస్తూ,

> [ఇశ్రాయేలు ప్రజలు] అమాలేకీయులను రెఫీదీములో ఓడించినప్పుడు కూడా అదనపు వస్తువులను వారు సంపాదించి ఉంటారు (17:8-16). అదనముగా ఏ వస్తువులు కావలసివచ్చినను సీనాయి ద్వీపకల్పము గుండా ప్రయాణించే బిడారుల నుండి కొనుగోలు చేయవచ్చు.[2]

విలువైనవియు మరియు మనఃపూర్వకమైనవియు మాత్రమే గాక, ఇశ్రాయేలీయులు ఇచ్చిన **బంగారు** మరియు **వెండి** అర్పణలు ప్రయోగాత్మకమైనవి మరియు ఉపయోగకరమైనవి. ఇవ్వబడిన బంగారము నిబంధన మందసమును పూతవేయుటకు ఉపయోగించారు, మరియు దహన బలులను అర్పించే బలిపీఠమును ఇత్తడితో పూతవేసారు.[3]

**వచనము 8.** ఇశ్రాయేలీయులు ఏమి నిర్మించాలి అని మరియు వారు ఎలా నిర్మించాలో కూడా దేవుడు మోషేతో చెప్పాడు (35:30-36:2 చూడండి). ఇశ్రాయేలీయులు ఒక **పరిశుద్ధస్థలము**ను కూడా నిర్మింపవలసినవారిగా ఉన్నారు. מִקְדָּשׁ (*miqdash*) అను పదమునకు అక్షరార్థము "పరిశుద్ధ స్థలము" (36:1 చూడండి) మరియు పాతనిబంధనపు తదుపరి కాలంలో ఈ పదము దేవాలయము నేపథ్యంలో ప్రయోగింపబడింది (యిర్మీ. 17:12).[4] దేవుడు దానిని పరిశుద్ధపరచాడు గనుక అది పరిశుద్ధమైనది. ఈ ప్రత్యక్షగుడారము యొక్క ప్రధానమైన ఉద్దేశమును గూర్చి కూడా ఇక్కడి వాక్యభాగము ఒక సూచన ఇస్తుంది: దేవుడు **వారిలో నివసించునట్లు** దానిని వారు నిర్మించాలి.

నిజానికి, భూమ్యాకాశములను సృష్టించిన దేవుడు మనుష్యుల చేతితో నిర్మింపబడిన దేవాలయములలో నివసింపడు (అపొ. 17:24). అలాగే ఆయన ఒక స్థలమునకు మాత్రమే పరిమితము కూడా చేయబడలేదు, ఎందుకంటే ఆయన సర్వవ్యాప్తి (కీర్తనలు 139:7-12). కాని, ఒక ప్రత్యేకమైన విధానములో దేవుడు ఆ ప్రత్యక్షగుడారములో నివసించాడు: అక్కడ ఆయన తన ప్రజలను కలిసేవాడు, ప్రత్యేకంగా ఆ కరుణా పీఠము దగ్గర (25:22). ఇదే విధంగా, తరువాతి కాలంలో దేవుడు దేవాలయములో నివసించాడు (1 రాజులు 8:10-13).

ప్రత్యక్షగుడారము అనేది దేవుడు నివసించే స్థలము కాగా, తదుపరి కాలములో దేవుడు మానవాళితో జరిపిన సంప్రదింపులకు ఒక ఛాయగా లేదా ఒక విధానముగా కనిపిస్తుంది.

1. క్రీస్తు యొక్క శరీరధారియగుటను గూర్చి మాట్లాడుటకు క్రొత్తనిబంధన రచయితలు ఇటువంటి పరిభాషనే వాడారు. "ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని

మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" అని యోహాను వ్రాసాడు (యోహాను 1:14). "నివసించెను" అను మాటకు (σκηνόω, *skēnoō*) అను గ్రీకు పదమును రచయిత వాడాడు, దీనికి అర్థము "ప్రత్యక్షగుడారము," లేదా "గుడారములో నివసించడం." (ఇదే పదము ప్రకటన గ్రంథము 21:3లో కూడా ప్రయోగింపబడింది.) కాబట్టి, ప్రత్యక్షగుడారములో దేవుడు నివసించడం అనేది దేవుని కుమారుడైన, వాక్యమైనవాడు ఒక నూతన యుగాన్ని ప్రారంభించునప్పుడు చేయుడానికి ఒక ఛాయగా కనిపిస్తుంది. యేసు "శరీరధారిగా ఉన్న దేవుడు," ఆయన తన నివాసాన్ని మనుష్యుల మధ్య చేసికొనునట్లు ఆయన మానవ శరీరముతో జీవించాడు.

2. ప్రత్యక్షగుడారము సంఘమునకు ఒక ఛాయగా లేదా ఒక రకముగా ఉంది. ప్రస్తుత కాలములో, దేవుడు అన్ని చోట్లను ఉన్నాడు; కాని ప్రత్యేకముగా ఆయన సంఘములో, అనగా క్రైస్తవులు "ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్న" స్థలములో (ఎఫెసీ. 2:22; చూడండి 1 కొరింథీ. 3:16) నివసిస్తున్నాడు.

3. ప్రత్యక్షగుడారమును మరియు సంఘమును ఈ రెండు కూడా పరలోకమునకు ఒక ఛాయగా ఉన్నాయి. "ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును" అని యోహాను వ్రాసాడు (ప్రకటన 21:3).

**వచనము 9.** దేవుని చిత్తమునకు అనుగుణముగా ఇశ్రాయేలీయులు ఈ పరిశుద్ధ స్థలమును కట్టలవలసియున్నారు. ప్రత్యక్షగుడారము యొక్క నిర్మాణము కథనము అంతటిలో, వారు కడుతుండగా ఇశ్రాయేలీయులు దేవునికి విధేయులైయుండునట్లును మరియు ఆయన ఆజ్ఞాపించిన విధముగానే వారు కట్టుటకు పూనుకోవాలని మరలా మరలా చెప్పబడింది. "దేవుని యొక్క బృహత్ప్రణాళికను జరిగించడం అనేది చాలా అవసరం" అని Cole వ్రాస్తూ అన్నాడు.[5] వారి పనిని విజయవంతంగా పూర్తిచేయడం అనేది ఒక విధంగా, అంటే కనీసం సగభాగమైనా, దేవుని నిర్దేశములను వారు శ్రద్ధగా జరిగించడంపై ఆధారపడి ఉంది. హెబ్రీయులకు 8:4, 5 వచనములలో నిర్గమకాండము 25:40 ప్రస్తావించబడింది: "కొండమీద నీకు కనుపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్తపడుము." హెబ్రీ ప్రతికలోని వాక్యభాగము లేవీయుడైన యాజకుని ఒక క్రొత్తనిబంధన యొక్క "పరలోకసంబంధపు వస్తువుల" "ఛాయా రూపకముగా" చెప్తుంది.

**మోషేకు మందిరము యొక్క ఆ రూపమును దాని ఉపకరణములన్నిటి రూపమును** చూపిస్తానని దేవుడు చెప్పినప్పుడు, ఇశ్రాయేలీయులు ఏమి నిర్మించాలో అనే దానిని గూర్చిన ఒక దృశ్యరూపాన్ని ఇవ్వాలని దేవుడు అనుకున్నట్లుగా అనిపిస్తుంది. ఈ ప్రత్యక్షగుడారమును గూర్చిన ప్రణాళికలో "బహుశ ఒక దర్శనము కూడా ఉండి ఉంటుంది" అని Durham అభిప్రాయపడ్డాడు.[6] దేవుడు ఖచ్చితముగా ఏమి కోరుకుంటున్నాడో నిర్మాణం చేస్తున్న వారికి తెలియునట్లు దేవుడు మోషేకు ఒక నమూనా పటం ఇచ్చాడని మరొక ఆలోచన.

## నిబంధన మందసము (25:10-16)

**[10]వారు తుమ్మకఱ్ఱతో నొక మందసమును చేయవలెను. దాని పొడుగు రెండుమూరలునర, దాని వెడల్పు మూరెడునర, దానియెత్తు మూరెడునర [11]దానిమీద మేలిమి బంగారు రేకు పొదిగింపవలెను; లోపలను వెలుపలను దానికి పొదిగింపవలెను; దానిమీద బంగారు జవను చుట్టు కట్టవలెను. [12]దానికి నాలుగు బంగారు ఉంగరములను పోతపోసి, ఒక ప్రక్కను రెండు ఉంగరములు ఎదుటి ప్రక్కను రెండు ఉంగరములు ఉండునట్లు దాని నాలుగు కాళ్లకు వాటిని వేయవలెను. [13]తుమ్మకఱ్ఱతో మోతకఱ్ఱలను చేసి వాటికి బంగారు రేకులను పొదిగించి [14]వాటితో ఆ మందసమును మోయుటకు ఆ ప్రక్కల మీది ఉంగరములలో ఆ మోతకఱ్ఱలను దూర్చవలెను. [15]ఆ మోతకఱ్ఱలు ఆ మందసపు ఉంగరములలోనే ఉండవలెను. వాటిని దానియొద్దనుండి తీయకూడదు; [16]ఆ మందసములో నేను నీకిచ్చు శాసనముల నుంచవలెను.**

ప్రజలు నిర్మించబోయే ఆ గుడారములో ఏయే ఉపకరణములు పెట్టాలో అని వివరిస్తూ ప్రత్యక్షగుడారము నిర్మించుటకుగల నిర్దేశాలను దేవుడు మొదలుపెట్టాడు. సుస్పష్టంగా, తన గుడారము కొరకు ఒక ప్రణాళికను ఇచ్చుటలో, అతిపరిశుద్ధముగా పరిగణించబడుతున్న - అనగా కరుణాపీఠముతో కలిపి ఉన్న నిబంధన మందసమును - దానితో మొదలుపెడుతున్నాడు. తరువాత, 26వ అధ్యాయములో, గుడారమును గూర్చి సరియైన నిర్దేశములను దేవుడు ఇచ్చాడు.

**వచనములు 10, 11.** దేవుడు వివరించిన మొదటి ఉపకరణము ఏమనగా నిబంధన **మందసము**, ఎందుకంటే బహుశ ఈ మందసమే ప్రత్యక్షగుడారమునకు కేంద్రబిందువుగా ఉండి ఉంటుంది. ఈ మందసమునకు పైన కరుణా పీఠం ఉంటుంది, దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో కలవాలని నిర్ణయించుకొనిన స్థలము ఇదియే (25:21, 22). కాని, కరుణాపీఠమును గూర్చి వివరించుటకు మునుపు, అది ఉంచవలసిన మందసము యొక్క నిర్మాణమును గూర్చిన కొన్ని సూచనలు ఇవ్వాలి.

ఈ వాక్యములో "మందసము" అని అనువదింపబడిన אֲרוֹן (*'ᵃron*) అనే హెబ్రీ పదము ఆదికాండము 6:14లోను మరియు నిర్గమకాండము 2:3 లోను (KJV అనువాదములో) అనువదింపబడిన "మందసము" (תֵּבָה, *thebah*) అనే పదముతో ఒకటి కాదు. ఇక్కడ "మందసము" అని అనువదించబడిన ఈ పదమును "భోషాణము" (అంటే పెట్టె లేదా సొరుగు లేదా మేజా) అని అనువదించవచ్చు.[7] NRSV అనువాదము మామూలుగా "మందసము" అనే పదాన్నే ఉంచుతుంది, కాని NIV అనువాదము "భోషాణము" అని అనువదిస్తుంది. ఈ మందసము అనేది సుమారు 45 అంగుళాల పొడవు, 27 అంగుళాల వెడల్పు, మరియు 27 అంగుళాల ఎత్తు ఉన్న ఒక పెట్టె లేదా భోషాణము. ఈ కొలమానం ఒక మూరను పద్దెనిమిది అంగుళాలుగా కొలుస్తుంది. అది **తుమ్మ కఱ్ఱ**తో చేయబడి **బంగారు** పూత వేయబడుతుంది.

9వ వచనములో ద్వితీయా విభక్తి ("నీకు") నుండి 10వ వచనములో తృతీయా విభక్తి ("వారు")కి మారడం మనం చూడగలం. దీనికి బహుశ ఒక కారణం ఏమంటే

ఇక్కడ మూల భాషయైన హెబ్రీ వాక్యభాగంలో ఒక సమస్య ఉంది; NASB అనువాదము ఈ Masoretic text యొక్క మూల భాషను అనుసరిస్తుంది, కాని సెప్టువజింట్ మరియు సమరియుల పంచగ్రంథాలు ఈ రెండు వచనములలో "నీవు" అనే అనువదించాయి. కొన్ని అనువాదములు అయితే ఈ రెండు వచనములలోను "నీవు" అనే సూచిస్తున్నాయి (REB; NAB; NJB), కాని NASB లాంటి కొన్ని అనువాదములు (KJV; NKJV; NRSV; ESV) 10వ వచనములో "వారు" అని మరియు 11వ వచనములో **నీవు** అనియే అనువదించాయి. ఉదాహరణకు, "వారు ఒక భోషాణము చేయవలెను" అని 10వ వచనములో NIV అనువదించింది మరియు "[నీవు] దానిని పొదిగింపవలెను అని 11వ వచనములో అనువదించింది. ఇక్కడ విభక్తి ప్రత్యయములో ఉన్న మార్పు అంతటి ముఖ్యమైనది కాదేమో.

**వచనములు 12-15.** ఇశ్రాయేలీయులు అరణ్యములో తిరుగుచున్నప్పుడు ఆ మందసమును కూడా వారితో తీసికొనివెళ్లునట్లు తగిన ఏర్పాట్లు చేయవలెను. ఫలితంగా, ఈ పెట్టెను తగిలించుకొనుటకు వీలుగా ప్రక్కలలో **బంగారు ఉంగరములు** పెట్టారు. ఈ ఉంగరములలో **తుమ్మకఱ్ఱతో** చేయబడి **బంగారు రేకుల**తో పొదిగింపబడిన **మోతకఱ్ఱలు** శాశ్వతముగా ఉంచబడవలెను. దీనిద్వారా మనుష్యులు ఈ మందసమును అసలు తాకకుండానే దానిని ఒకచోట నుండి ఇంకొక చోటకు రవాణా చేయుటకు సాధ్యపడునట్లు ఈ నమూనా ఇవ్వబడినది.

**వచనము 16.** ఈ మందసములోనే **శాసనములను** ఉంచాలి, అంటే, పది ఆజ్ఞలు చెక్కబడియున్న ఆ రెండు రాతిపలకలు ఉంచబడాలి (40:20 చూడండి). దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో చేసిన నిబంధనకు ఈ శాసనములు సూచనలు. దేవుని యొక్కయు మరియు ఆయన ధర్మశాస్త్రము యొక్కయు పరిశుద్ధతను బట్టి, ఈ మందసము కూడా పరిశుద్ధమైనది మరియు దానిని ముట్టకూడదు.

దేవుని పరిశుద్ధమైన ప్రసన్నత ఈ మందసములో ఎంతగా ఆవరించింది అంటే దానిని దుర్వినియోగపరచడం అంటే దేవునే అగౌరపరచినట్లు గనుక చాలా ఘోరమైన పర్యావసానాలు ఉంటాయి (2 సమూ. 6:6, 7). దేవుని ప్రసన్నతకు సూచనగా, అరణ్యములో ఇశ్రాయేలు ప్రజలు నడచినప్పుడు మరియు యుద్ధముచేసినప్పుడు ఆ మందసమే వారిని నడిపించింది. ప్రయాణమునకు ఈ మందసము ఎత్తబడిన ప్రతిసారీ, దేవుడే స్వయాన కార్యము చేయుటకు లేచినట్లుగా ఉండేది. ఆ మందసము తిరిగి ప్రత్యక్షగుడారములో ఉంచబడినప్పుడు, తన ప్రజల మధ్యలో నివసించుటకు దేవుడే స్వయంగా తిరిగివచ్చినట్లు ఉండేది (సంఖ్యా. 10:35, 36). ఇశ్రాయేలీయులు కనాను దేశము లోనికి ప్రవేశించడానికి యోర్దాను నదిని దాటినప్పుడు, మందసము కూడా వారికి ముందుగా వెళ్లింది. ప్రజల ముందు అది ఉండడం అంటే, దేవుని ప్రసన్నత మరియు శక్తి వారి ముందు ఉండి యోర్దాను నదిని దాటి ఆరిన నేలలో అడుగుపెట్టుటకు వారిని అనుమతించింది (యెహోషువ 4:5-18).

దేవుని ప్రసన్నత మందసములో ఉన్నది అనుటకు ఋజువు ఏమంటే పండ్రెండ్రు మంది వేగులవారి విషయంలో జరిగిన సంఘటన (సంఖ్యా. 13; 14). వాగ్దాన దేశములోనికి ప్రవేశించుటకు వారు అనుమతించబడరు అని దేవుడు ఇశ్రాయేలు

ప్రజలకు చెప్పిన తరువాత, ఏ విధము చేతనైనా అమాలేకీయులపై యుద్ధము చేయాలని వారు గట్టిగా పట్టుబట్టారు. కాని, యుద్ధమునకు మోషేకాని లేదా ఆ మందసముకాని ఆ యుద్ధ భూమిలోకి వెళ్లలేదు. అవి అక్కడ లేవు అంటే దేవుని ప్రసన్నత అక్కడ లేదు అనే అర్థం, కాబట్టి ఇశ్రాయేలీయులు ఓడింపబడ్డారు (సంఖ్యా. 14:43-45).

ఈ మందసము ఎంతగా దేవుని ప్రసన్నతకు చిహ్నముగా నిలిచింది అంటే, ఇశ్రాయేలీయులు మరియు ఇశ్రాయేలీయేతరులు కూడా ఈ మందసమును స్వయానా దేవునితోనే పోల్చడం మొదలుపెట్టారు. ఈ మందసముపై ఒకవిధమైన మూఢనమ్మకాన్ని కూడా పెట్టుకొని, దేవుని చిత్తమును పట్టించుకొనకుండా, వారి వారి ఉద్దేశములను నెరవేర్చుకొనుటకుగాను దీనిని ఒక మాయతంత్రముగా ఉపయోగించుటకు పూనుకున్నారు. 1 సమూయేలు 4-6లో, దేవుడు మందసమునకు మాత్రమే పరిమితమై లేడు కాబట్టి ఇశ్రాయేలు ప్రజలకు విజయాన్ని ఇవ్వడానికి ఆయన ప్రలోభపెట్టబడలేడు అని దేవుడు ఇశ్రాయేలీయులకు బోధించాడు. ఇదే సమయములో, ఇశ్రాయేలీయుల దేవుడు తమ దేవుళ్లకంటే గొప్పవాడు అనే విషయాన్ని ఫిలిష్తీయులకు కూడా బోధించాడు.

మందసము అనేది ఇశ్రాయేలీయుల ఆరాధనకు కేంద్ర బిందువుగా ఉండేది - అరణ్యములో మాత్రమే కాదు, కాని వారు దేశముగా కనానులో స్థిరపడిన తరువాత కూడా. తద్వారా, సొలొమోను నిర్మించిన దేవాలయములో తరువాతి కాలంలో ఇది ఉంచబడింది. “క్రీ.పూ. 586లో యెరూషలేము పట్టణము దోచుకొనబడినప్పుడు బహుశ ఈ మందసము పాడైపోయి ఉంటుంది.”[8]

మందసము యొక్క నిర్మాణమును గూర్చి అధ్యయనం చేయడం ద్వారా, ప్రత్యక్ష గుడారమును గూర్చిన అనేకమైన విషయాలు స్పష్టమౌతున్నాయి. దేవునిచే ఆజ్ఞాపించబడిన ఉపకరణములు పరిశుద్ధత, విలువ, ఉపయోగత మరియు సౌందర్యము అనే లక్షణాలచే నిర్వచింపబడుతున్నాయి. (1) *పరిశుద్ధత.* ప్రత్యక్షగుడారమునకు కేంద్ర బిందువైన మందసము, దేవుడు ప్రధానయాజకునితో కలిసికొనే స్థలమైన అతిపరిశుద్ధ స్థలములో ఉంచబడింది. ఈ స్థలము నుండి బయటకు, పరిశుద్ధత కొంచెం తగ్గుతూ వస్తుంది. మందసమునకు దగ్గరలో ఉన్న ప్రదేశము మరియు ఉపకరణములు అన్నియు పరిశుద్ధమైనవి, కాగా మందసమునకు కొంచెం దూరంలో ఉన్న ప్రదేశము మరియు ఉపకరణములు తక్కువ పరిశుద్ధమైనవి. (2) *విలువ.* ప్రత్యక్షగుడారములోని అన్ని వస్తువులు కూడా విలువైన మరియు ఖరీదైన ముడివస్తువులతోనే చేయబడింది. కాగా, ప్రత్యక్షగుడారమునకు కేంద్ర బిందువును మరియు అత్యంత పరిశుద్ధతను కలిగి ఉన్న మందసము, అత్యంత విలువైన ముడిసరుకు అంటే బంగారముతో చేయబడింది. (3) *ఉపయోగత.* మందసమునకు దానిలోనే ఒక విధమైన సాదృశ్యపు మరియు ధార్మిక సంబంధమైన విలువ ఉండగా, మరియు బంగారముతో పొదిగింపబడిన పెట్టెగా చాలా ఆకర్షణీయమైనదిగా ఉన్ననూ, దానికి ఒక ప్రయోగాత్మక ఉపయోగం కూడా ఉంది: దీనిలో ధర్మశాస్త్రమునకు సంబంధించిన శాసనములు ఉంచబడినవి. (4) *సౌందర్యము.* మందసమును నిర్మించిన

నిర్దేశములలో సౌందర్యము అనే నియమాన్ని కూడా చూడగలం. ఈ పెట్టె ఒక ఉద్దేశాన్ని నెరవేర్చడము మాత్రమే గాక, అది ఆకర్షణీయంగా కూడా ఉండునట్లు చేయబడింది. ఈ సుందరమైన ప్రపంచాన్ని సృష్టించిన దేవుడు, తన ప్రజలు తనను ఆరాధించునట్లు ఒక సుందరమైన స్థలాన్ని కూడా రూపొందించాడు.

## కరుణా పీఠము (25:17-22)

**[17]మరియు నీవు మేలిమి బంగారుతో కరుణాపీఠమును చేయవలెను. దాని పొడుగు రెండు మూరలునర దాని వెడల్పు మూరెడునర. [18]మరియు రెండు బంగారు కెరూబులను చేయవలెను. కరుణాపీఠము యొక్క రెండు కొనలను నకిషిపనిగా చేయవలెను. [19]ఈ కొనను ఒక కెరూబును ఆ కొనను ఒక కెరూబును చేయవలెను. కరుణాపీఠమున దాని రెండు కొనల మీద కెరూబులను దానితో ఏకాండముగా చెయవలెను. [20]ఆ కెరూబులు పైకి విప్పిన రెక్కలుగలవై కరుణాపీఠమును తమ రెక్కలతో కప్పుచుండాగా వాటి ముఖములు ఒండొంటికి ఎదురుగా నుండవలెను. ఆ కెరూబుల ముఖములు కరుణా పీఠముతట్టు నుండవలెను. నీవు ఆ కరుణాపీఠమును ఎత్తి ఆ మందసముమీద నుంచవలెను. [21]నేను నీకిచ్చు శాసనములను ఆ మందసములో నుంచవలెను. [22]అక్కడ నేను నిన్ను కలిసికొని కరుణాపీఠముమీద నుండియు, శాసనములుగల మందసము మీద నుండు రెండు కెరూబుల మధ్య నుండియు, నేను ఇశ్రాయేలీయుల నిమిత్తము మీ కాజ్ఞాపించు సమస్తమును నీకు తెలియజెప్పెదను.**

**వచనము 17.** నిబంధన మందసమునకు పైన, **కరుణాపీఠము** ఈ పెట్టెకు ఒక మూతలా అమర్చబడింది. "మూత" అని సాధారణంగా అనువదింపబడు כַּפֹּרֶת (*kapporeth*) అను హెబ్రీ పదమునకు "కరుణాపీఠము" అనేది వివరణ కంటే ఒక అనువాదము అనడమే మంచిది.[9] ఈ పదము ద్వంద్వ అర్థ ప్రయోగములో వాడబడినట్లు అనిపిస్తుంది: మొదటిగా, ఇది స్పష్టంగా ఈ మందసమునకు ఒక "మూత"గా అనిపిస్తుంది. మరొకటి ఏమంటే, పాపపరిహార దినమున బలిపశువు యొక్క రక్తము ఈ మందసము యొక్క "మూత"పై ప్రోక్షింపబడినప్పుడు ఇశ్రాయేలు యొక్క పాపములు "కప్పబడ్డాయి," లేదా పరిహరింపబడ్డాయి అనేదానిని సూచిస్తుంది. ఇదే పదము యొక్క మరొక రూపాన్ని లేవీయకాండము 7:7లో "పరిహారము"గా అనువదించారు, మరియు లేవీయకాండము 23:27-32లో "పాపపరిహార దినము"ను గూర్చి మాట్లాడే నేపథ్యంలో కూడా ఇదే విధంగా అనువదింపబడింది. ఈ పదాన్ని హెబ్రీ భాషలో "యోమ్ కిప్పూర్" అంటారు అంటే "కప్పబడు దినము" అని అర్థం. నేటికి కూడా యూదులచే ఇది ఆచరింపబడుతూనే ఉంది.

**వచనములు 18-21.** దేవుడు తన ప్రజలతో కలిసి మాట్లాడుటకుగాను అనువైన స్థలముగా, ఈ "కరుణాపీఠము" లేదా "మూత," **కెరూబులతో** బాటు, మేలిమి **బంగారముతో** చేయబడాలి. "కెరూబులు" (כְּרֻבִים) అనేది "కెరూబు" (כְּרוּב) అనే మాటకు బహువచన పదము. పరిశుద్ధ గ్రంథము నుండి కెరూబులను గూర్చి చాలా తక్కువ తెలుస్తుంది. వాటికి **ముఖములు** మరియు **రెక్కలు** ఉన్నాయి అని మరియు 45 x 27

అంగుళాల ఖాళీ ఉన్న ఒక పెట్టెపై తమ రెండు రెక్కలను ఒకదానికి ఒకటి ఎదురుబొదురుగా పెట్టుకోగలిగినంత చిన్నవైన రెక్కలు కలిగినవిగా ఈ వాక్యభాగం చెప్తుంది. ఆదాము మరియు హవ్వలు పాపము చేసిన తరువాత వారిని బయటకు పంపివేసి ఆ ఏదేను తోటకు కాపలాగా దేవుడు కెరూబులను ఇచ్చాడు గనుక (ఆది. 3:24), ప్రజలు ఊహించుకొనేటట్లుగా అవి చూడముచ్చటైన దేవదూతల వంటివి కావేమో:

> కెరూబులు అనేవి పునరుజ్జీవన కాలపు కళలలో కనబడే ప్రేమ దేవతల వంటివి కావు కాని మానవ - శిరస్సుతో రెక్కలు కలిగి ఉండే ప్రాచీన మెసొపొతామియా మరియు సిరో - పాలస్తీనా కళలకు చెందిన సింహముల వంటి జీవాలు. ప్రాచీన పశ్చిమ ఆసియాలో ఈ కెరూబులు చేతులను పెట్టుకొనుటకు పెద్ద పెద్ద సింహాసనాలపై చెక్కబడిన లేదా రాజుల సింహాసనాలను అలంకరింపజేయబడినవిగా కనబడుతున్నాయి . . . ఇట్లుండగా, మందసము అనేది అదృశ్యమైయున్న ఇశ్రాయేలు దేవునికి సాదృశ్యపు సింహాసనముగా ఉంది (1 సమూ. 4:4), దేవుడు ఈ కెరూబుల మధ్య నివసిస్తూ తన ప్రజలను అక్కడ కలిసి వారిని పరిపాలించినట్లుగా తెలుస్తుంది (నిర్గమ. 25:22).[10]

“అవి బహుశ మానవ - ముఖముతో రెక్కలను కలిగియున్న సింహికలు” అని Cole అన్నాడు.[11]

పది ఆజ్ఞలలో రెండవది “పైన ఆకాశమందేగాని క్రింద భూమియందేగాని భూమిక్రింద నీళ్లయందేగాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు” అని చెప్తుంది (నిర్గమ. 20:4, 5). ఏ కారణము చేతనైనను లేదా ఏ ఉద్దేశముతోనైనను ఎటువంటి విగ్రహమును అయినా చేయడం తప్పు అని కొంతమంది ఈ ఆజ్ఞను గూర్చి బోధిస్తున్నారు. కరుణాపీఠము మీద కెరూబులను రూపించి ఉంచాలని మరియు ప్రత్యక్షగుడారమునకు లోపలి తెరలో నకిషిపని చేయాలని చెప్పిన విధానాన్నిబట్టి (36:35) చూస్తే ఆరాధన చేసే ఉద్దేశముతో మాత్రమే ఒక బొమ్మను చేయడాన్ని దేవుడు నిషేధించాడు అని అర్థమౌతుంది. కెరూబులు ఆరాధింపబడకూడదు; కాబట్టి, ఆజ్ఞ అతిక్రమింపబడలేదు.

**వచనము 22. అక్కడ నేను నిన్ను కలిసి** కొంటాను అని దేవుడు అన్నాడు. దేవుడు ప్రజలతో కలిసిన స్థలము ఈ కరుణాపీఠము. ఇశ్రాయేలు చరిత్రలో తరువాతి కాలములో, సైన్యములకధిపతియగు యెహోవా “కెరూబుల మధ్య ఆసీనుడైన”వాడు అని వారు భావించారు (1 సమూ. 4:4). అక్కడ నుండి దేవుడు మోషేకు ఇచ్చిన ప్రత్యక్షతలతో దేవుడు ప్రజలను నడిపించాడు. సంవత్సరమునకు ఒకసారి, ప్రధాన యాజకుడు అతిపరిశుద్ధ స్థలములోనికి వెళ్లి కరుణాపీఠము మీద రక్తమును ప్రోక్షించు దినమున ఆయన వారితో అక్కడ కలిసేవాడు (హెబ్రీ. 9:5, 7).

**శాసనము** అనునది దేవుని ధర్మశాస్త్రమును గూర్చి, ప్రత్యేకంగా ధర్మశాస్త్రమునకు ఆయువుపట్టు అయిన రెండు రాతిపలకలను గూర్చి, మాట్లాడుటలో ఒక విధానం. ఈ పలకలు “పది ఆజ్ఞలు చెక్కబడియున్న రాతిపలకలే [34:28], మరియు అవి శాసనముగా ఎందుకు పిలువబడ్డాయి అంటే దేవునికిని మరియు ఇశ్రాయేలు ప్రజలకు

మధ్యన చేయబడిన ఆ నిబంధనను గూర్చి ఇవి మాట్లడుతున్నాయి గనుకనే" అని Umberto Cassuto అన్నాడు.[12] ఈ పలకలను "శాసనములు"గా పరిగణించింది ఎందుకంటే ఒకవేళ ప్రజలు ధర్మశాస్త్రమును నిర్లక్ష్యము చేసినా లేదా అతిక్రమించినా దానికి అందు వ్రాయబడియున్న విధులు సాక్ష్యముగా ఉంటాయి అని తెలుస్తుంది.

**కరుణా పీఠముమీద నుండియు** మరియు **కెరూబుల మధ్య నుండియు** ఆయన ఇశ్రాయేలు ప్రజలతో మాట్లాడతానని దేవుడు అన్నాడు. సుస్పష్టంగా, అరణ్యములో ఈ ప్రత్యక్షగుడారములోనే మోషే దేవుని నుండి అనేకమైన ఆదేశాలను అందుకున్నాడు. ఆ తరువాత, "రెండు కెరూబుల మధ్య" నుండి దేవుడు క్రొత్త ఆదేశాలను తరచూ ఇచ్చినట్లుగా మనకు ఎట్టి ఆధారములు లేవు.

## సముఖపు రొట్టె బల్ల (25:23-30)

**23మరియు నీవు తుమ్మకఱ్ఱతో నొక బల్ల చేయవలెను. దాని పొడుగు రెండు మూరలు దాని వెడల్పు ఒక మూర దాని యెత్తు మూరెడునర. 24మేలిమి బంగారు రేకును దానికి పొదిగించి దానికి చుట్టు బంగారు జవను చేయింపవలెను. 25దానికి చుట్టు బెత్తెడు బద్దెచేసి దాని బద్దెపైని చుట్టును బంగారు జవ చేయవలెను. 26దానికి నాలుగు బంగారు ఉంగరములను చేసి దాని నాలుగు కాళ్లకుండు నాలుగు మూలలలో ఆ ఉంగరములను తగిలింపవలెను. 27బల్లమోయుటకు మోతకఱ్ఱలు ఉంగరములును బద్దెకు సమీపముగా నుండవలెను. 28ఆ మోతకఱ్ఱలు తుమ్మకఱ్ఱతో చేసి వాటిమీద బంగారు రేకు పొదిగింపవలెను; వాటితో బల్లమోయబడును. 29మరియు నీవు దాని పళ్లెములను ధూపార్తులను గిన్నెలను పానీయార్పణముకు పాత్రలను దానికి చేయవలెను; మేలిమి బంగారుతో వాటిని చేయవలెను. 30నిత్యమును నా సన్నిధిని సన్నిధి రొట్టెలను ఈ బల్లమీద ఉంచవలెను.**

25వ అధ్యాయములో శేషించిన భాగము ప్రత్యక్ష గుడారపు అతిపరిశుద్ధ స్థలములో ఉంచవలసిన మూడు ఉపకరణములలో రెండిటిని గూర్చి మాట్లాడుతుంది - సముఖపు రొట్టె బల్ల మరియు దీపవృక్షము. వీటిని తయారుచేయుటలో కూడా బంగారము ఉపయోగింపబడినది.

**వచనములు 23, 24.** సముఖపు రొట్టె బల్ల సుమారు 36 అంగుళాల పొడవు 18 అంగుళాల వెడల్పు మరియు 27 అంగుళాల ఎత్తు. నిబంధన మందసమును నిర్మించుటకు ఉపయోగించిన **తుమ్మ** కఱ్ఱతోనే దీనిని కూడా చేయవలసియుంది. ఇంకా చూస్తే, ఇది కూడా మందసమువలెనే **బంగారము**తో పొదిగింపబడాలి.

**వచనములు 25-28.** మందసము మాదిరిగానే, ఒక స్థలము నుండి మరొక స్థలమునకు తీసికొనివెళ్లుటకు వీలుగా **బంగారు ఉంగరముల**తోను మరియు **మోతకఱ్ఱల**తో ఈ బల్ల చేయబడాలి.

**వచనము 29.** ఈ బల్ల దగ్గర ఉపయోగించవలసిన పనిముట్లు (**పళ్లెములు, దూపార్తులు, గిన్నెలు** మరియు **పానీయార్పణ పాత్రలు**) కూడా **మేలిమి బంగారము**తోనే చేయబడాలి. ఈ పాత్రలు, లేదా వాటి వంటివి, తరువాతి కాలములో యుద్ధములలో

నెబుకద్నెజరు మరియు బబులోను వారిచే కొల్లగింపబడి తీసికొనిపోబడ్డాయి (2 రాజులు 25:13-17; ఎజ్రా 1:7-11).

**వచనము 30.** ఈ **బల్ల** కేవలం సుందరమైనది మాత్రమే కాదు, కాని చాల ప్రయోగాకరమైనది కూడా: దానిపై **సముఖపు రొట్టెను** ఉంచాలి. ఈ రొట్టెలో పండ్రెండ్రు ముక్కలు ఉంటాయి అవి ఎల్లప్పుడు ఆ బల్లమీదనే ఉంటాయి. ప్రతి విశ్రాంతి దినమున పాతవి తీసి క్రొత్తవి పెట్టేవారు, మరియు ఆ పాట రొట్టెలను కేవలం యాజకులు మాత్రమే తినాలి (లేవీయ. 24:5-9). ఇక్కడి ప్రతీకవాదమును గూర్చి వాక్యము ఏమీ చెప్పడం లేదుగాని, ఈ రొట్టెలు బహుశ ఇశ్రాయేలు పండ్రెండ్రు గోత్రములను సూచించేవిగా ఉండి ఉంటాయి. ప్రజలంతా తమనుతాము ఒకే జనాంగముగా చూసుకోవాలని ఇది వారికి జ్ఞాపకము చేయుటకు ఇవ్వబడినది కాబోలు. ఈ బల్లపై నిత్యమూ రొట్టె ఉండడాన్ని బట్టి చూస్తే ప్రజలు దేవునికి చెందిన వారు మరియు అనునిత్యమూ తన సన్నిధిలోనే ఉన్నారు అని సూచిస్తుంది.

రోమా పట్టణములోని తీతు యొక్క కనాను (Arch of Titus)లోని దృశ్యంలో ఈ సముఖపు బల్ల మరియు దీపవృక్షము కూడా ఉన్నాయి. తీతు యొక్క సహోదరుడైన డొమీషియాన్ చే నిర్మించబడిన ఈ శిలాఫలకము, క్రీ.శ. 70వ సంవత్సరములో రోమీయులు యూదులపై సాధించిన విజయానికి స్మారకముగా ఉంది. కొల్లగింపబడిన సొమ్ముగా ఈ బల్ల మరియు దీపవృక్షము యెరూషలేము దేవాలయము నుండి తీసికొనబడి రోమా పట్టణమునకు ఊరేగింపుతో తీసికొనివెళ్లబడినవి.



**తీతు యొక్క కనాను (Arch of Titus)లో చిత్రీకరించబడిన దీపవృక్షము మరియు బల్ల**

## బంగారపు దీపవృక్షము (25:31-40)

**31మరియు నీవు మేలిమి బంగారుతో దీపవృక్షమును చేయవలెను; నకిషిపనిగా ఈ దీపవృక్షము చేయవలెను. దాని ప్రకాండమును దాని శాఖలను నకిషి పనిగా చేయవలెను; దాని కలశములు దాని మొగ్గలు దాని పువ్వులు దానితో ఏకాండమైయుండవలెను. 32దీపవృక్షముయొక్క ఒక ప్రక్కనుండి మూడుకొమ్మలు,**

**దీపవృక్షముయొక్క రెండవ ప్రక్కనుండి మూడు కొమ్మలు, అనగా దాని ప్రక్కలనుండి ఆరుకొమ్మలు నిగుడవలెను. [33]ఒక కొమ్మలో మొగ్గ పువ్వుగల బాదము రూపమైన మూడు కలశములు, రెండవ కొమ్మలో మొగ్గ పువ్వుగల బాదము రూపమైన మూడు కలశములు; అట్లు దీపవృక్షమునుండి బయలుదేరు కొమ్మలలో నుండవలెను. [34]మరియు దీపవృక్ష ప్రకాండములలో బాదము రూపమైన నాలుగు కలశములును వాటి మొగ్గలును వాటి పువ్వులును ఉండవలెను, [35]దీపవృక్ష ప్రకాండమునుండి నిగుడు ఆరుకొమ్మలకు దాని రెండేసి కొమ్మలక్రింద ఏకాండమైన ఒక్కొక్క మొగ్గచొప్పున ఉండవలెను. [36]వాటి మొగ్గలు వాటి కొమ్మలు దానితో ఏకాండమగును; అదంతయు మేలిమి బంగారుతో చేయబడిన ఏకాండమైన నకిషిపనిగా ఉండవలెను. [37]నీవు దానికి ఏడు దీపములను చేయవలెను. దానియెదుట వెలుగిచ్చునట్లు దాని దీపములను వెలిగింపవలెను. [38]దాని కత్తెర దాని కత్తెరచిప్పయు మేలిమి బంగారుతో చేయవలెను. [39]ఆ ఉపకరణములన్ని నలుబది వీసెల మేలిమి బంగారుతో చేయవలెను. [40]కొండమీద నీకు కనుపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్తపడుము.**

**వచనములు 31, 32.** ఈ పరిశుద్ధ స్థలము యొక్క మరొక విశేషము ఏమంటే ఈ **దీపవృక్షము.** కెరూబులు మరియు కరుణాపీఠము మాదిరిగానే, ఇది కూడా **మేలిమి బంగారముతో** చేయబడాలి. దీని **క్రింద** నుండి ఒక **ప్రకాండము** పైకి వస్తుంది, దీనిపై దీపము అమర్చబడి ఉంటుంది మరియు దానిలో నుండి **ఆరు కొమ్మలు** బయటకు వస్తూ, ఒక్కొక్క కొమ్మ ఒక్కొక్క దీపమును పట్టుకొనునట్లు చేయబడాలి. దీపవృక్షమునకు హెబ్రీ పదము. ఈ మెనోరాః అనునది "ఏడు - కొమ్మలు గల దీపవృక్షము" మరియు ఇది "యూదా మతమునకు ఒక గొప్ప చిహ్నముగా మారింది."[13]

**వచనములు 33-36.** ఈ దీపవృక్షము వెలుతురునిచ్చే ఒక ఉపయోగకరమైన వస్తువు, మరియు సుందరమైనది కూడా. ఉదాహరణకు, **బాదము కలశములు** మరియు **మొగ్గలు** ఉండునట్లు ఇది కళాత్మకంగా రూపించబడింది, కాని కేవలం వెలుతురును మాత్రమే ఇవ్వడానికి ఇవన్నియు అవసరం లేదు. దేవుడు ఇశ్రాయేలు ప్రజలతో కలిసే ఆ స్థలము చూడటానికి చాలా సుందరమైనదిగా మరియు రమ్యమైనదిగా ఉండునట్లు కోరాడు.

**వచనములు 37-39.** ఈ **దీపములు** ప్రత్యక్షగుడారములో కనబడే ఆ ఒకే **వెలుగు**ను ఇచ్చేది. సాదృశ్యకంగా, దేవుడు మాత్రమే వెలుగునకు - అంటే ఇశ్రాయేలు ప్రజలు నిరంతరమూ మనుగడలో ఉండుటకుగాను పైనుండి వచ్చిన వెలుగునకు - మూలము అనే విషయాన్ని తెలుపునట్లు ఈ దీపవృక్షము దోహదపడి ఉంటుంది.

**వచనము 40.** దీపవృక్షమును గూర్చి వివరించిన తరువాత, దేవుడు తన ప్రజలను మరలా హెచ్చరించాడు: **కొండమీద నీకు కనుపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్తపడుము.** 25వ అధ్యాయములో ప్రత్యక్షగుడారము యొక్క నిర్మాణమును గూర్చి ఇవ్వబడిన నిర్దేశములు 9వ మరియు 40వ వచనములలో ఇవ్వబడిన ఒకే విధమైన హెచ్చరికల నడుమ ఉంచబడ్డాయి. ఈ "విధమును" గూర్చి మాట్లాడుతూ, "*నేను నీకు కనుపరచు విధముగా*" అని 9వ వచనం చెప్తుంది, మరియు

40వ వచనములో అయితే, "కొండమీద నీకు *కనుపరచబడిన*" అని చెప్పబడింది (ఉద్ఘాటన జోడించబడినది). ఇక్కడి కాలములో మార్పు చూడండి. బహుశ 9వ వచనములో దేవుడు ఇంకా కనుపరచడం మొదలుపెట్టి ఉండడు, కాని 40వ వచనములో ఆయన మోషేతో మాట్లాడు సమయమునకు ఆయన ఆ విధమును - అంటే కనీసం ఇక్కడ చెప్పబడిన ఉపకరణముల విషయమును గూర్చి అయినా - చెప్పే ఉంటాడు.

దీపవృక్షము యొక్క ప్రాముఖ్యతను గూర్చి Cole అనే రచయిత ఈ క్రింది విషయాలను సూచించాడు:

> ఇక్కడి ప్రతీకవాదము యొక్క అర్థము . . . మనకు చెప్పబడలేదు. ఈ దీపవృక్షము అనునది ఇశ్రాయేలు ప్రజలు అన్యజనులకు వెలుగుగా నియమింపబడియున్నారు అనే విషయాన్ని చెప్తుంది అని భావిస్తారు (యెషయా 60:3). ఖచ్చితంగా "ఏడు" అనేది ఎప్పుడూ కూడా సంపూర్ణతను సూచించే ఒక సంఖ్య: నూనె అనునది, కనీసం తరువాతి కాలములోనైనా, దేవుని ఆత్మకు సాదృశ్యంగా మారింది (జెకర్యా 4:1-6). కాని ఇక్కడి ప్రతీకవాదము వెలుగును గూర్చినదై యుంటుంది, ఎందుకంటే దేవుని ప్రసన్నతయే ఈ వెలుగును ప్రజలకు తెస్తుంది (సంఖ్యా. 6:25), అంతేకాక పాతనిబంధనలో ఈ వెలుగు అనేది జీవానికి మరియు విజయానికి కూడా ప్రతీకగా ఉంది (కీర్తనలు 27:1).[14]

# అన్వయము

## ప్రత్యక్ష గుడారము: "రాబోవుచున్న మేలుల యొక్క ఛాయ" (25:1-9)

నిర్గమకాండము యొక్క చివరి పదహారు అధ్యాయాలు గుడార నిర్మాణము యొక్క కథచే ఆధిపత్యము వహించబడుతున్నాయి. ఎందుకు? ఎందుకనగా ప్రత్యక్ష గుడారము అనునది దేవుని సాన్నిధ్యము యొక్క చిహ్నము. నిర్గమకాండము ముగిసినప్పుడు, ప్రత్యక్ష గుడారము పూర్తయి మరియు ఏర్పాటు చేయబడినది. ఆ సమయములో, "మేఘము ప్రత్యక్షపు గుడారమును కమ్మెను మరియు యెహోవా తేజస్సు మందిరమును నింపెను" (40:34). కాబట్టి నిర్గమకాండము అను పుస్తకము ఐగుప్తులో ఉన్న బానిసలు దేవుని ప్రజలుగా ఎలా మారిరి, వారి మధ్య దేవుడు నివసించెను అనుదాని గూర్చి చెప్పుచున్నది.

దాని సొంత సందర్భములో మందిరపు నిర్మాణమునకు ఎంత ప్రాముఖ్యత ఉన్నదో, క్రొత్త నిబంధన క్రైస్తవులకు కూడా దాని అర్థము పరంగా ప్రాముఖ్యత ఉన్నది. క్రైస్తవులకు మందిరము యొక్క ప్రాముఖ్యతను ముఖ్యంగా హెబ్రీయులకు వ్రాసిన పత్రిక యొక్క రచయితే సూచించెను "ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలదికాదు" (హెబ్రీ. 10:1). ప్రత్యక్ష గుడారమునకు మరియు క్రొత్త నిబంధన సంఘమునకు మధ్య ఉన్న అనేక విశేషమైన పోలికలను రచయిత గుర్తించెను మరియు ఇంకొన్ని పోలికలను చూడవచ్చు అని సూచించాడు (హెబ్రీ. 9:1-

5). మందిరము నుండి సంఘము గూర్చి క్రైస్తవులు ఏమి నేర్చుకొనగలరు?

*మందిరము దేనిని పోలియున్నది - మరియు అది సంఘము యొక్క ఛాయ ఎలా అవుతుంది?* మందిరము అనునది ఒక ఆవరణములో ఉన్న గుడారము. ఆ గుడారము లోపల రెండు అరలు కలవు, పరిశుద్ధ స్థలము మరియు అతి పరిశుద్ధ స్థలము. పరిశుద్ధ స్థలము లోపల మూడు విధములైన ఉపకరణములు కలవు: రొట్టెనుంచు బల్ల, బలులను అర్పించు బలిపీఠం, మరియు బంగారు దీపవృక్షము. అతి పరిశుద్ధ స్థలము లోపల నిబంధనా మందసము కలదు. మందసముపై ఉన్న మూత కరుణా పీఠముగా పిలువబడుతుంది. కరుణా పీఠము యొక్క రెండు కొనల వైపున రెండు కెరూబులు పైకి విప్పిన రెక్కలు గలవై దానిని కప్పును. ఆవరణములో బలులు అర్పించుటకు బలిపీఠం మరియు పరిశుద్ధ స్థలములోకి వెళ్లుటకు ముందు యాజకులు కడుగుకొనుటకు నీటితో ఉన్న ఒక తొట్టె కలదు.

ఆరాధనలో మరియు అర్పణలో ఈ పరికరాలు ఎలా ఉపయోగపడేవి? అర్పించుటకు బలులను తెచ్చుటకు ఏ ఇశ్రాయేలీయుడైన ఆవరణములోకి వెళ్లవచ్చు. ధర్మశాస్త్రము కోరినట్లు చాలా అర్పణల కొరకు యాగము యొక్క బలిపీఠం దినదినము ఉపయోగించేవారు. యాజకులు ప్రతీ రోజు పరిశుద్ధ స్థలమునకు వెళ్లుటకు ముందు కడుగుకొనుటకు నీళ్లు కలిగిన తొట్టె అక్కడ ఉండేది. అతి పరిశుద్ధ స్థలములోకి ప్రధాన యాజకుడు మాత్రమే ప్రవేశింపగలడు, సంవత్సరములో ఒక సారి మాత్రమే అతడు వెళ్లగలడు, ప్రాయశ్చిత్త దినమందు, తన కొరకు మరియు ఇశ్రాయేలు ప్రజల కొరకు ప్రాయశ్చిత్తము చేయుటకు వెళ్లేవాడు.

క్రొత్త నిబంధన కాలమునకు ప్రత్యక్ష గుడారము ఏ విధముగా ముందస్తు సూచనగా ఉన్నది? సంఘములో మనము కనుగొనే వాస్తవాలకు పాతనిబంధన వాక్యములను ఛాయగా వర్తింపజేయునప్పుడు మనము చాలా జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉన్నది. ఈ విధమైన బైబిలు అధ్యయనాన్ని మనము దుర్వినియోగము చేసి బైబిలు అర్థమివ్వని అర్థాలను మనము చేస్తుంటాము. ఈ పద్ధతిని సురక్షితముగా ఎలా ఉపయోగించగలము? ఆ ఛాయ ఏ వాస్తవమును చూపుతుందో మనము ఖచ్చితముగా ఉండాలి మనము దానిని జ్ఞాపకము చేసుకొనినట్లైతే బైబిలు చెప్పే ఒక్క దానిని మాత్రమే మనము ఖచ్చితముగా చెప్పగలము.

ప్రత్యక్ష గుడారములో అనేక విషయాలు క్రొత్త నిబంధన యుగంలో విషయాలు వంటివి కనిపిస్తాయి: రొట్టేనుంచు బల్ల అనునది ప్రభు రాత్రి భోజనం వలె నున్నది; దీపవృక్షము అనునది దేవుని వాక్యము వలె నున్నది; బలులు నర్పించు బలిపీఠం అనునది ప్రార్థన వలె నున్నది; నీటి తొట్టెలో కడుగుకోనుట అనునది బాప్తిస్మము వలె నున్నది; పరిశుద్ధ స్థలము మందిరము వలె నున్నది; అతి పరిశుద్ధ స్థలము పరలోకము వలె నున్నది. వాక్యములో అవి స్పష్టముగా పేర్కొనబడనట్లైతే ఈ పోలికలను గూర్చి మనము చర్చించకూడదు.

ఏదేమైనా, క్రొత్త నిబంధనను స్పష్టముగా క్రైస్తవ యుగానికి పోల్చిన మందిరమును గూర్చి కొన్ని విషయాలు ఉన్నాయి. హెబ్రీయులు యేసు క్రీస్తును పాతనిబంధన యుగంలో ప్రధాన యాజకునితో పోల్చిరి మరియు యేసు తనను తాను బలిగా

అర్పించుకున్నదానిని పాతనిబంధన క్రింద అర్పించిన యాగములతో పోల్చిరి. అంతేకాక, క్రైస్తవులుగా మనము దేవునికి బలులు అర్పించుచున్న యాజకులమని, క్రొత్త నిబంధన మనకు బోధిస్తుంది (రోమా. 12:1, 2). ప్రత్యక్ష గుడారమును మందిరముతో పోల్చుటలో మనము కూడా నీతిమంతులుగా తీర్చబడ్డాము, దానిలో ప్రత్యక్ష గుడారము అనునది దేవుడు ప్రజలను కలుసుకొను స్థలము; అది దేవుని యొక్క సాన్నిధ్యమునకు సంకేతముగా ఉన్నది మరియు ఇశ్రాయేలీయుల మధ్యలో ఆయన ఉన్నాడు. అదే విధముగా, ఆలయము నుండి ఒక ఆకారమును తీసుకొని, మందిరము దేవుడు నివసించు స్థలమని క్రొత్త నిబంధన చెప్తున్నది (ఈ సందర్భములో అది ప్రత్యక్ష గుడారము వలె నున్నది). అందువలన, దేవుడు మనలో నివసించును!

*మందిరము ఎలా నిర్మించబడినది - మరియు దాని నిర్మాణము నేటి సంఘముతో ఎలా సంబంధము కలిగియుంది?* మొదటిగా, దేవుని ప్రణాళిక ప్రకారము అది నిర్మించబడినది (25:9; 40:16). రెండవదిగా, మంచి నాయకత్వం ద్వారా అది నిర్మించబడినది. దేవుని నిర్దేశాలను అనుసరించాలని మోషే నిర్ధారించాడు. ప్రత్యక్షపు గుడారమును వాస్తవ నిర్మాణములో నడిపించు మనుష్యులను దేవుడు ఏర్పరచెను (31:1-6; 35:10, 30-35). మూడవదిగా, సమాజమంతటి సహాయముతో మరియు ఔదార్యముగల బహుమతులతో అది నిర్మించబడినది (35:4-9, 21, 22, 29; 36:1-7). ఈ రోజు తరచూ సత్యముగా అనిపించు, ఎక్కువగా ఇవ్వండి అని నాయకులు వేడుకొనుటకు బదులు, అప్పట్లో నాయకులు ప్రజలను ఇచ్చుట నిలిపివేయుడి అని వేడుకొనవలసివచ్చింది! వారు ధారాళముగా ఇచ్చుచున్నారు. ఇవన్ని సంఘమునకు సంబంధించిన దృష్టాంతాలుగా పని చేయవచ్చు.

*ముగింపు.* యేసు యొక్క బలి అర్పణ కొరకు, మరియు యాజకులుగా ఆయనను సమిపించ కలిగిన అవకాశము కొరకు, మన ప్రధాన యాజకుడైన, యేసుకు మనము కృతజ్ఞతలు చెల్లించవలసిన అవసరము ఉంది. మనము సంతోషముగా దేవునికి బలులను అర్పింపవలెను. క్రీస్తు యొక్క సంఘము క్షేమముగా కట్టబడుటకు, మనము (1) దేవుని నిర్దేశాలను అనుసరించవలెను, (2) మంచి నాయకత్వమును ఉపయోగించుకోవాలి, మరియు (3) దేవుడు మనలను దీవించిన వనరులతో మనము ఉదారముతో ఇయ్యవలెను.

## దేవుని యొక్క నివాసము (25:8)

ప్రత్యక్ష గుడారము అనునది ఆయన ప్రజల మధ్య దేవుడు నివసించు స్థలము. ఈ రోజు దేవుడు మందిరములో నివసించును (1 కొరింథీ. 3:16; ఎఫెసి. 2:21, 22). ఆయన ప్రతీ క్రైస్తవునిలో కూడా నివసించును (రోమా. 8:9; 1 కొరింథీ. 6:15-20; గలతీ. 4:6). అందువలన, మన శరీరాలను దేవునికి అంకితము చేయాలి (రోమా. 12:1, 2), వాటిని పరిశుద్ధమైనదిగా ఉంచాలి (1 కొరింథీ. 16:19, 20).

## “ప్రయాణము కొనసాగించుట” (25:12-15, 26-28)

పాత పాట “నాకు ప్రయాణము కొనసాగించాలని ఉంది” అని చెప్తున్నది. ప్రయాణము కొరకు ప్రత్యక్ష గుడారము నిర్మించబడినది; మందసమునకు, రొట్టెనుంచు బల్లకు, మరియు బలిపీఠమునకు జోడించిన ఉంగరములు మరియు కర్రల ద్వారా దానియొక్క సులభత్వమును స్పష్టము చేయవచ్చు. ఇశ్రాయేలీయులు ఒకే స్థలములో స్థిరపడకుండా, అరణ్యములో నలభై సంవత్సరాలు అపరిచితులుగా తిరిగారు. అదే విధముగా, ఈ లోకములో ఈ రోజు క్రైస్తవులు “పరదేశులును యాత్రికులునై”యున్నారు (1 పేతురు 2:11). మనము “స్థిరపడిపోకూడదు” మరియు మన స్థిర నివాసము ఈ లోకమును గూర్చి అలోచించకూడదు. “అన్య దేశములో, నేను ఇక్కడ పరదేశిని; నా ఇల్లు బంగారు తీరంపై దూరముగా ఉన్నది”[15] అని ప్రకటించే, మన విశ్వాస పాటల వరకు మనము జీవించాలి.

## దేవునితో కలుసుకొనుట - ఎక్కడ? (25:22)

మందిరములోని కరుణాపీఠం యొద్ద ఇశ్రాయేలీయులను కలుసుకొందునని యెహోవా చెప్పెను (25:22) మరియు అక్కడ ఆయన వారి మధ్యలో నివసించును (29:43, 45). నేడు క్రైస్తవులు దేవునితో ఎక్కడ కలుసుకొనవచ్చు? మనము ఆయనను కలుసుకొనేది మందిరములో. అది ఆయన మందిరము; ఆయన అక్కడ ఎప్పుడూ ఉండును. ఆయనలో ఉండాలంటే, మనము మందిరములో ఉండవలెను. సమావేశంలో కూడా మనము ఆయనను కలుసుకోవచ్చు (మత్తయి 18:20). ఏదేమైనా, మనము ఆయనను ఏ సమయములోనైనా లేదా ఏ స్థలములోనైనా కలుసుకోనవచ్చు; ప్రత్యేకముగా దేవునిని కలుసుకొనుటకు మనము ఎక్కడికి వెళ్లవలసిన పని లేదు (యోహాను 4:21-24 చూడుడి). ఎవరైతే సంఘములో ఉన్నారో వారు దేవునితో ఉన్నారు, మరియు దేవుడు ప్రతీ క్రైస్తవునిలో ఉన్నాడు, మీరు ఎల్లప్పుడూ ప్రభువు సన్నిధికి చేరగలిగియున్నాము.

---

సూచనలు

[1]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 355. [2]John J. Davis, *Moses and the Gods of Egypt: Studies in Exodus*, 2d ed. (Grand Rapids, Mich.: Baker Book House, 1986), 263. [3]KJV హెబ్రీ పదమును “ఇత్తడి” అని అనువదించింది. ఇతర అనువాదములు “కాంస్యము” అని అనువదించాయి (NKJV; NASB; NRSV; NIV). అది రాగి అని R. Alan Cole అభిప్రాయపడ్డాడు. (R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries [Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973], 189.) [4]Ibid., 190. [5]Ibid., 189. [6]Durham, 355. [7]Cole, 190. [8]Ibid., 192. [9]Ibid., 191. [10]Ronald F. Youngblood, *Exodus*, Everyman’s Bible Commentary (Chicago: Moody Bible Institute, 1983), 122.

[11]Cole, 191. [12]Umberto Cassuto, *A Commentary on the Book of Exodus*, trans. Israel Abrahams (Jerusalem: Magnes Press, 1997), 330. [13]Wilbur Fields, *Exploring*

*Exodus*, Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1976), 579. [14]Cole, 193. [15]E. T. Cassel, "I Am a Stranger Here," *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).